క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేజీబీవీ ఉపాధ్యాయినులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి బాలసుబ్బయ్య అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌలాలి ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఉపాధ్యాయినులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయినులకు పని భారం పెరుగుతుందే తప్ప పనికి తగ్గ వేతనం అందడం లేదన్నారు. మినిమమ్ టైంస్కేల్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలసుబ్బయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ముస్లిం జేఏసీ కన్వీనర్ గన్ని అబ్దుల్‌కరీం, కో కన్వీనర్ మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. ఈ విషయంపై బుధవారం డీఈఓ సుధాకర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యాహక్కు చట్టం అమలు జరగడం లేదని, ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.24ను యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఫీజు నియంత్రణ చట్టం, 25శాతం ఉచిత సీట్లు అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ కార్యవర్గ సభ్యులు ముల్లా ఖాజాహుసేన్, సుహేల్‌రాణా, మసుల్దార్ రెహమాన్, దాదాబాషా, మాస్టర్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితం



తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న వైద్యాధికారులు

ఉయ్యాలవాడ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని, తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, అపర్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామానికి చెందిన చాందిని అనే గర్భిణిని ప్రసవం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి గర్భిణి ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలన్నారు.

అటవీ సంరక్షణకు అంకిత భావంతో పనిచేయాలి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: అటవీ సంరక్షణకు ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని రుద్రవరం అటవీ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు స్థానిక అటవీ కార్యాలయంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో విలువైన వృక్ష సంపద, వన్యప్రాణుల రక్షణతో పాటు భూ ఆక్రమణలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజి అధికారి ముర్తుజా, ఫారెస్టర్లు ముక్తర్ బాషా, శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు



హరినగరం ఇస్కాన్ టెంపులులో రాధా కృష్ణులకు అభిషేకం చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని హరినగరం సమీపంలోని ఇస్కాన్ టెంపులులో బుధవారం రాధాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాధా కృష్ణులకు ఉదయం మంగళ హారతి, దర్శన హారతి నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించారు.అనంతరం 10 రకాల పుష్పాలతో అభిషేకం 108 రకాల వస్తువులతో మహా నైవేద్యం తయారు చేశారు. అలాగే రాధారాణిలపై వక్తలతో ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆలయ ఇన్‌చార్జి చంద్ర కేశవ దాస్ తదితరులు పాల్గొన్నారు.







ఆళ్లగడ్డలో నిమజ్జనానికి వెళ్తున్న వినాయక విగ్రహాలు , నంద్యాల పట్టణంలో అశేష భక్త జనం మధ్య సాగుతున్న గణనాథుల శోభాయాత్ర



తలపై మట్టి వినాయకుడిని తీసుకొస్తున్న చిన్నారి

ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా!

ఐదు రోజుల పాటు భక్తుల నుంచి విశేష పూజలు అందుకున్న గణనాథుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ కార్యక్రమం కనుల పండువగా సాగింది. ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా.. గణపతి బప్పా మోరియా నినాదం మార్మోగింది. వేడుకల్లో యువతీయువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నంద్యాలలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

- వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం
- నంద్యాలలో కనులపండువగా సాగిన శోభాయాత్ర
- చిన్న చెరువులో 5 క్రేన్‌లతో విగ్రహాల నిమజ్జనం
- అర్ధరాత్రి దాటే వరకు నిర్వహణ
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టిన పోలీసుశాఖ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఉత్సవ కమిటీల నిర్వాహకులు, భక్తులు విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో పట్టణ పుర వీధుల గుండా ఊరేగించారు. పట్టణ శివారులోని చిన్న చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయక ఘాట్‌లో గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం గంగాదేవికి పూజలు నిర్వహించారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, డీఆర్‌ఓ పద్మజ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, గణేష్ కేంద్ర ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు కలిసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి విగ్రహం ఉత్తరాధి మఠం వినాయకుడు, రెండోది నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కొలువైన పరిపాలన గణపతికి వీడ్కోలు పలికారు. ఆ తర్వాత సాయంత్రం నుంచి విగ్రహాల నిమజ్జనం ఊపందుకుంది. విగ్రహాలన్నీ కల్పనా సెంటర్‌కు చేరుకోవడంతో శోభాయాత్ర ప్రారంభమైంది. బైర్మల్‌వీధి, రీడింగ్ రూం జంక్షన్, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కు రోడ్డు మీదుగా ఈ యాత్ర కొనసాగింది. విగ్రహాలన్ని వరుసగా వెళ్తుండగా దారిపొడవునా భక్తులు దర్శించుకుంటూ పూజలు చేశారు. నంద్యాలలో 600లకు పైగా విగ్రహాలను ప్రతిష్టించారు. వీటన్నింటిని నిమజ్జనం చేయడానికి వినాయక ఘాట్ వద్ద ఐదు క్రేన్‌లను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి దాటే వరకు నిమజ్జన కార్యక్రమం కొనసాగింది.

పోటాపోటీగా లడ్డూ వేలం పాట

గణనాథుడి ప్రసాదం లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. బొమ్మలసత్రం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలం పాటలో నలంద స్కూల్ కరస్పాండెంట్ ఉత్తేజ్‌కుమార్ పాల్గొని రూ.1.21లక్షలకు దక్కించుకున్నారు. అదే విధంగా సంజీవనగర్‌లోని సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన వేలం పాటలో రూ.1,05,500కు జమాల్‌బాషా పాట పాడి లడ్డూను సొంతం చేసుకున్నారు. అలాగే టీచర్స్ కాలనీలో రాయల్ యూత్ సభ్యులు చీకటి రమేష్ రూ.45 వేలకు పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు.

ప్రసాదాల పంపిణీ

గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని పట్టణంలో గాంధీచౌక్, కాళికాంబగుడి, కల్పనా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసనగర్, వినాయక ఘాట్‌ల వద్ద నవనంది రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, కాళీమాత సేవా సమితి, పట్టణ జనరల్ మర్చంట్ అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం తదితర వాటి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, వాటర్ ప్యాకెట్ల పంపిణీ జరిగింది. నిమజ్జనం కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పురంధర్, ఉత్సవ కమిటీ నాయకులు విజయ్ కుమార్, నాగేంద్ర, చలంబాబు, నిమ్మకాయల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు...

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక ఘాట్ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, డీఎస్పీ యుగంధర్‌రెడ్డి స్వయంగా ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్ సిబ్బంది ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టారు.

ఆళ్లగడ్డ: పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు వినాయకులను నిమజ్జనానికి తరలించారు. ఉత్సవ విగ్రహాలన్ని నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్న తర్వాత భారీ ప్రదర్శన సాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జనం కొనసాగించారు.

బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో..

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీగురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట అక్కడ కొలువైన విఘ్నేశ్వరుడికి పూజలు చేశారు. ఈ పూజల్లో బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు నంద్యాల చిన్న చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేశారు.



నంద్యాలలో రంగులు చల్లుకుంటున్న యువకులు



వేలం పాటలో దక్కించుకున్న లడ్డూతో భక్తులు







వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం, ఉత్తరాధి మఠం వినాయకుడికి పూజలు చేస్తున్న మంత్రి , మట్టి వినాయకుడితో ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా

వరద బాధితులను ఆదుకుందాం

నంద్యాల(న్యూటౌన్): విజయవాడ వరద బాధితులను చేతనైన సాయం చేసి ఆదుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు.ఆ పార్టీ ఆధ్వర్యంలో బాధితుల కోసం సేకరించిన నిత్యావసర సరుకులను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి లారీలో పంపించారు. 100 ప్యాకెట్ల బియ్యం, కందిపప్పు, బట్టలు, తదితర నిత్యావసర సరుకులు సేకరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ సెక్రటరీ ధనుంజయుడు, నందికొట్కూరు రఘురామ్మూర్తి, గోస్పాడు హరినాథ్, నాగరాముడు, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న రామాంజనేయులు

నంద్యాల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో...

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులు సేకరించినట్లు పాస్టర్లు అందం ఏసన్న, ఏసుదాసు, తలారి ప్రసాద్, సునీల్, సైలాస్ తెలిపారు. సేకరించిన నిత్యావసర సరుకులను బుధవారం ఎస్పీజీ క్రీడా మైదానంలో ప్యాకింగ్ చేశారు. వేల కుటుంబాలకు సహాయం చేయాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల పాస్టర్ల బృందం సభ్యులు రవి, యోన, మోహన్, పాస్టర్ మనోజ్, పాల్ కిశోర్, క్లెమైంట్ తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: వరద బాధితుల సహాయార్థం మండలంలో నిత్యావసర సరుకులు సేకరిస్తున్నట్లు ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, మండల నాయకులు గోకారి అన్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.లక్ష విలువైన నిత్యావసర సరుకులను సేకరించినట్లు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి నాయకులు రమేష్, హుసేనయ్య, నాగేశ్వరరావు, శీను, మహేష్, గుండుమయ్య, మౌలా, శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగల్లపాడు పాఠశాల ఆకస్మిక తనిఖీ

చాగలమర్రి: మండలంలోని నగల్లపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ న్యామతుల్లా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి చదువు సమర్థ్యాన్ని అంచనా వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి, సిబ్బంది దావూద్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

జ్వాలా వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజ చేపట్టారు.

అలరించిన భజన

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన మారుతీ వెంకటేశ్వరరావు భజన మండలి వారు నిర్వహించిన భజన కార్యక్రమం అలరించింది. భజన కీర్తనలను నగేష్, రామకృష్ణ, పెద్దయ్య, సంజన్న, నాగేశ్వరప్ప, రాజమోహన్‌రెడ్డి, కోటేశ్వర్, నారాయణరెడ్డి, బీరప్ప, లోకేశ్వరరెడ్డి ఆలపించారు.

టీకాలతో వ్యాధుల నియంత్రణ

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలను వేయించడం వల్ల వారికి భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. ఆయన బుధవారం ఇల్లూరు నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయం 113లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ.. నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాలు వచ్చేంత వరకు పలు విడతలుగా టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు ఇవ్వడం వల్ల క్షయ, కంఠసర్పి, అంధత్వం, కామెర్లు, అతిసారం, ధనుర్వాతం, పోలియో, న్యుమోనియా, కోరింత దగ్గు, హెపటైటిస్–బి వంటి జబ్బులు రాకుండా నియంత్రించవచ్చన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

అట్రాసిటీ కేసు నమోదు

ఉయ్యాలవాడ : మాయలూరు గ్రామానికి చెందిన ఈడిగె రవిచంద్రుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులురెడ్డి తెలిపారు. అదే గ్రామానికి చెందిన గంగపోగు రాజగోపాల్ నరసింహ అనే వ్యక్తిని కులం పేరుతో దూషించి దాడి చేసి గాయపరిచారన్నారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

నేడు చాగలమర్రి పంచాయతీ సమావేశం

చాగలమర్రి: సర్పంచ్ పెద్దయ్య గారి తులశమ్మ ఆధ్వర్యంలో గురువారం చాగలమర్రి పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఈఓ, ఈఓపీఆర్‌డీ తాహీర్ హుసేన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పంచాయతీ పరిధిలోని అన్నీ వార్డులకు సంబంధించిన వార్డు సభ్యులు హాజరు కావాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

నంద్యాల(అర్బన్): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నంద్యాల డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులతో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): 9వ ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు బుధవారం గురురాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి క్రీడా దుస్తులు అందజేశారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో అన్నవరంలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. గురురాఘవేంద్ర విద్యాసంస్థల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బాలు, సురేష్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ఆళ్లగడ్డ: పట్టణంలోని పాలసాగరం బాలుర పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పోషకాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ అవగాహన కల్పించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని సూపర్‌వైజర్ సూచించారు. అనంతరం చిరుధాన్యాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉసేనమ్మ, దనలక్ష్మి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

బొమ్మలసత్రం: వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు సర్కారు పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అన్నారు. వరదలు విజయవాడను ముంచెత్తడంతో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందన్నారు. దీనికి చంద్రబాబే కారణమని, అధికారుల ముందస్తు హెచ్చరికలను ఆయన పట్టించుకోలేదన్నారు. బుధవారం ఆయన నంద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఇల్లు వరదలో మునగకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు తప్ప ప్రజలను పట్టించుకోలేదన్నారు. దీంతో విజయవాడలోని పలు ప్రాంతాలు జలమయమ అయ్యాయని పేర్కొన్నారు. దాదాపు 60 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఇప్పటి వరకు బాధిత కుటుంబాలకు అండగా నిలబడకపోగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు మీడియాకు ఫోజులిచ్చారని విమర్శించారు. వలంటరీ వ్యవస్థ ఉండి ఉంటే వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడమే గాక సహాయక కార్యక్రమాలు వేగంగా జరిగేవన్నారు. ఇప్పటికైనా సర్కారు వరద బాధితులను ఆదుకోవడంపై దృష్టి సారించాలని చెప్పారు.

ఆటలతో ఆరోగ్యం



ఆటలపై అవగాహన కల్పిస్తున్న కోచ్, పీడీ విశ్వనాథ్

గోస్పాడు: అథ్లెటిక్స్ ఆటలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని డీఎస్ఏ స్టేడియం ఇన్‌చార్జ్, అథ్లెటిక్స్ కోచ్ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని దీబగుంట్ల హైస్కూలులో బుధవారం పీడీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అథ్లెటిక్స్‌లో విద్యార్థులు రాణించాలన్నారు. క్రీడల్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, ట్రిపుల్ జంపు, రన్నింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గత నెలలో ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అండర్–16 విభాగంలో గెలుపొందిన సంతోష్‌కుమార్, రామచరణ్‌తేజ్‌లను వారు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి.లీలా వెంకటశేషాద్రి బుధవారం మార్కెట్ యార్డులో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులకు అవసరమైన సహాయం ఉచితంగా అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ ఉందని తెలిపారు. ప్రతి ఒక్క కార్మికుడు ఈ–శ్రమ్, పీఎం ఎస్‌వైఎం కార్డును చేయించుకుంటే లబ్ధి పొందవచ్చని, మీకు, మీ కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సిస్టమ్, శాశ్వత లోక్ అదాలత్ అందించే న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సి.సాంబశివ, న్యాయవాది పి.నిర్మల, లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, మార్కెట్ యార్డు సెక్రటరీ గోవిందు పాల్గొన్నారు.



నంద్యాల మండలం బ్రాహ్మణ పల్లె–పాణ్యం మండలం మద్దూరు గ్రామాల మధ్య కుందూనదిపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనకు ఇరువైపుల గ్రిల్ లేకపోవడంతో వరద నీరు ప్రవహించే సమయంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సార్లు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపుల గ్రిల్స్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. –నంద్యాల(అర్బన్):